


హాస్పిటల్ ఆవరణంతా నిశ్శబ్దంగా వుంది. సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు రకరకాల మనుషులతో, రోగులతో, చిత్ర విచిత్రాలైన రోగాలతో అపర యమలోక మనిపించే ఆ సర్వజన వైద్యశాల రాత్రి పదిగంట లయ్యేసరికి అతి నిశ్శబ్దంగా, ప్రశాంతంగా వుంటుంది. మధ్య మధ్య రోగులు బాధలను భరించలేక చేసే ఆక్రందనలు ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని భయంకరంగా చేస్తాయి. పూర్వజన్మలో పాపాలకు ఫలితం ఈ జన్మలో శిక్ష అనుభవిస్తున్నా మనుకొనేవాళ్ళు కొందరు, ఈ జన్మలో చేసిన పాపాలకు ఈ జన్మలోనే శిక్ష అనుభవిస్తున్నా మనుకొనేవాళ్ళు మరికొందరు...భగవంతుని పిలుపుకోసం యెదురు చూసేవాళ్ళు...ఇంకా బ్రతకాలనే ఆశతో ఆ భగవంతుని ప్రార్థించేవాళ్ళూ ... 'తప్పు చేయకనే తమకెందుకీ శిక్ష'... అని ఆ భగవంతుని నిందించేవాళ్ళూ ... తమ అనంతరం తమ భార్యాపిల్లల్ని కాపాడమని ప్రార్థించేవాళ్ళూ...ఏనాడూ భగవంతుని ప్రార్థించని వాళ్ళూ ... రోజూ ప్రతిపనికి నీవే దిక్కు' అంటూ వాడిని తలుచుకొనేవాళ్ళూ... రక రకాల మనుషులు మనస్తత్వాలతో ఆ హాస్పిటలంతా నిండిపోయివుంది. ఎవరి మనసుల్లో ఏమున్నా ఆ సమయంలోమాత్రం అందరూ బాధలను మరచి నిద్ర పోవడానికి ప్రయత్నిస్తున్నవాళ్ళే ...

దాదాపు అందరూ నిద్రపోతున్న ఆ వార్డులో ఐదోనంబరు గదిలో కిటికీకి దగ్గరగావున్న మంచం మీద రెండు కాళ్ళూ ముడుచుకొని కూర్చుని చిక్కని చీకటిలోకి చూస్తూంది సుజాత.

ఆ కళ్ళలో బ్రతకాలనే ఆశవున్నా బ్రతకనేమో నన్న భయంకూడావున్నాయి.

రక్తంలేక పాలిపోయిన ముఖం, సంవత్సరంనుండి గుండెజబ్బుతో క్షీణించి పోయిన శరీరం ... అంతకంటె మించిన శరీరంలోని బాధ అన్నీ కలిసి సుజాతలో నిరాశా, నిస్పృహలను యెత్తి చూపిస్తున్నాయి.

మనసుమాత్రం మూగగా ఆలోచిస్తోంది.

'అసలు తనకు ప్రేమంటే తెలుసా'...

పేలవమైన నవ్వొకటి మెరిసింది సుజాత పెదవుల మీద...

'తన తల్లికి తను అక్రమంగా పుట్టడం వల్ల తల్లిప్రేమ యేమిటో తనకు తెలియదు. తండ్రి బ్రతికే వున్నాడో, పోయాడో కూడా తెలియదు. తనకు జరిగిన ఈ అన్యాయానికి ఎవర్ని నిందించాలి?...

'ఆ తల్లిదండ్రులనా...

'కఠినమైన నిబంధలతో తనలాంటి అనాథలను ప్రేమకు నోచుకోనివ్వకుండా చేసిన ఈ లోకాన్నా...

లేకపోతే పైన కూర్చుని వినోదం చూస్తున్న ఆ భగవంతుడినా ... ఎవరి నేమనాలి?

మళ్ళీ ఒక పేలవమైన చిరునవ్వు మెరిసిందామె పెదవుల మీద ... దూరంగా ఎవరో రోగి బాధ భరించలేక కాబోలు యేడుస్తున్నాడు. నర్సు వస్తోన్నట్లుంది. అందరూ తమ బాధలు చెప్పుకొంటున్నారు. నర్సు విసుక్కొంటోంది.

సుజాత చెవులకవి రోజూ వినిపించే శబ్దాలే...

'నోరు మూసుకొని పడుకో...' ప్రక్క గదిలో రోగిని నర్సు గట్టిగా కసురుకొంది.

ఉలిక్కిపడి దిండుపైన వెనక్కు వాలి కళ్ళు మూసుకొని పడుకొంది సుజాత.

ఆలోచనలు ఈగల్లా ముసురుతున్నాయి.

నర్సు గదిలోకి తొంగి చూసి సుజాత నిద్రపోతూందనుకొని వెళ్ళిపోయింది.

మళ్ళీ లేచి కూర్చుంది సుజాత. అలా గంటలతరబడి కూర్చుని ఆ కిటికీలోంచి చూస్తూ ఆలోచించడమంటే ఆమెకు చాల యిష్టం.

'సుజాత!' తనకీ పేరు యెవరు పెట్టారో...

మళ్ళీ నిర్జీవమైన చిరునవ్వు మెరి

తిండి పెదవుల మీద.

'ఇంకెవరు పెడ్తారు? ... వాళ్ళ తప్పు ... ఆ జ్ఞాపకం రాగానే ఆమె ముఖం మళ్ళీ అతి బాధాకరంగా పాలిపోయింది. తన తల్లిని ఒక్కటంటే ఒక్కసారి చూపించమని యెన్ని సార్లు ప్రార్థించినా వాళ్ళ మనసు కరుగలేదు. తాను లోకం దృష్టిలో వాళ్ళు పెంచుకొన్న అనాథ...వాళ్ళయింట్లో పిల్లలకు పెద్దవాళ్ళకు అణగిమణగి పడివుండే దిక్కులేని అనాథ...అయినదానికీ, కాని దానికీ ఆ యింట్లో అందరి తిట్లు భరించి, చేయిచేసుకొంటే పహీనంగా శరీరాన్నప్పగించి నిల్చుండిపోయే అనాథ. '...తను అనాథకాదని తన తల్లి బ్రతికే వుందని చచ్చిపోయేముందు అమ్మమ్మ చెప్పకపోతే తనకుమాత్రం యేం తెలిసేది?...'

'అమ్మమ్మ...పాపం తనముందే తన కోడలు, కొడుకు, వాళ్ళపిల్లలు తన స్వంత కూతురిబిడ్డను మాటలతో, చేతలతో చిత్రహింస పెడ్తుంటే భరించలేక, నిజంచెప్పి లోకానికి తన కూతురును లోకువ చేయలేక అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోయి చివరికి ఆ రాత్రి తనకా విషయం చెప్పేసి నిశ్చింతగా కళ్ళు మూసుకొంది...'

వున్న ఆ ఒక్క ఆలంబనమూ పోయి తను గిలగిల లాడిపోయింది. తన తల్లినైనా ఒక్కసారి చూడాలనే కోర్కెను వాళ్ళ నిరంకుశత్వం చంపేసింది. జీవితంలో 'ప్రేమ' అనే వస్తువు తనకు ఈ జన్మలో లభించదనుకొనే సమయంలో తనపాలిటి గొప్పవరంలా ఈ గుండెజబ్బు వచ్చింది.

రెండుమూడు రెకమెండేషన్లతో ఈ ఆస్పత్రిలో తన్ను తోసేసి వాళ్ళభారం వాళ్ళు వదిలించుకొన్నారు.

అందుకు తను బాధపడటంలేదు... ఈ జబ్బుతో ఎప్పుడో ఒకరోజు తనకు నూరేళ్ళు నిండిపోతాయి. కాని...కాని ...ఈ జన్మలో తనకు ప్రేమగా పిలిచే ఆప్తులు...ఆప్యాయంగా ఒక్క చిరునవ్వు నవ్వే అభిమానులు...లేరనే బాధే తన వదనాన్ని పిండేస్తోంది. తనలాంటి దురదృష్టవంతులీ ప్రపంచంలో యెంత మంది వున్నారో...

సుజాత కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి.

దగ్గరలోనే పరిచితమైన తనకత్యంత ప్రియమైన కంఠం వినిపిస్తోంది.

సుజాత చటుక్కున మంచంపైన వెనక్కివాలి కళ్ళు మూసుకొంది.

ఆమె కళ్ళముందు తెల్లని దుస్తులతో, చచ్చిపోయే రోగికైనా బ్రతకాలనే ఆశ కలిగించే మెరుపులుగల కళ్ళతో డాక్టర్ సారథి ప్రత్యక్షమయ్యాడు.

'తనపిచ్చి...తనకి లోకంలో ఎవరూ లేరనుకొంటోంది...సారథి... ఆప్యాయంగా, ఆత్రుతగా, తనకు బ్రతుకంటే ఆశ కలిగించేలా మాట్లాడే సారథి తనకున్నాడు...'

'నువ్వు ధైర్యంగా వుండాలి సుజా... ఈ లోకంలో నాకెవ్వరూ లేరని బాధపడటమెందుకు?... పిచ్చి పిల్లవి ... నేను లేనూ... నీ చుట్టూ వున్న ప్రపంచం లేదూ...ఆ పైన భగవంతుడు లేడూ...'

తన తలపైన చేయివేసి ఆప్యాయంగా నిమురుతూ ఓదార్చే సారథి.

'తను మందు తాగనని మొండిగా ప్రవర్తిస్తే...ఇలాగైతే నిన్ను భరించడం నాకు కష్టం అవుతుంది 'సుజా...' అంటూ తన భుజాల చుట్టూ చేతులేసి పట్టుకొని బలవంతాన మందు తాగించే సారథి.

అవును...తను దురదృష్టవంతురాలు కానేకాదు...నిజంగా తను అదృష్టవంతురాలు...సారథి తనవాడు...'

ఆ రోజు అడిగేసింది అతని ముఖంలోకి చూస్తూ... 'నిజంగా మీకు ... నేనంటే యిష్టమా డాక్టర్...'

ఒక క్షణం తెల్లబోయి తన ముఖంలోకి చూసి వెంటనే నవ్వుతూ... 'అదేం ప్రశ్న... నువ్వంటే నాకెంతో యిష్టం సుజా... నువ్వు మళ్ళీ మామూలు మనిషివి కావాలనీ, చేయబోయే ఆపరేషన్ సక్సెస్ కావాలనీ నేనెప్పుడూ భగవంతుని కోరుకొంటుంటాను...'

సుజాత ముఖంలో వేయి మెరుపులు మెరిశాయి.

'నువ్వంటే నాకెంతో యిష్టం సుజా...' అన్న మాటలే ఆమె చెవుల్లో గింగురు మన్నాయి.


## రచయితలకు మనవి

### కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరించబడని తమ వ్రాతప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాతప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాతప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

### నవలలు

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాతప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాతప్రతులతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంప నవసరం లేదు. 100 అరఠావు పేజీల పయిన ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింప బడుతాయి.

### కార్టూన్లు

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరిచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము. కాని, వాటి విషయములో ఎటువంటి బాధ్యతనీ స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్లు పంపగలరు.

సంపాదకుడు

ఆంధ్రసచిత్రవారపత్రిక

# మనిషిలోని మమత

మొట్టమొదటి సారిగా 'ప్రేమ... అప్యాయతా' ఇలా వుంటాయా అనుకొంది.

తనూ బ్రతకాలి...బ్రతికి సారధితో... ఇంక ఆలోచించలేక పోయింది.

హృదయమంతా తీయటి భావనలు...

సారధి తనవాడైతే తనకంటే అదృష్టవంతులింకెవరుంటారు ?...

కాని...కాని...ఆ భయంకరమైన ఆపరేషన్...అదే...అదే... ఇప్పుడు ... తనేం చేయాలి...? భగవంతుడు దయదలచి బ్రతికిస్తే... 'స్వామీ ... యే నేరమూ చేయకపోయినా యిప్పటివరకు అనుభవించవలసినవన్నీ అనుభవించాను ... ముందు అనుభవించబోయే జీవితానికే నేను యిన్నీ యింత ఓపిగ్గా భరించానేమో... నా భవిష్యత్తును... నా మధురమైన ముందు జీవితాన్ని ఇంతటితో త్రుంచేయకు తండ్రీ...'

రెండుచేతులూ జోడించి చీకట్లోనే కనిపించని ఆ భగవంతునికి నమస్కరించింది సుజాత.

చల్లని మృదువైన హస్తం ఆమె నుదుటిని అప్యాయంగా తాకింది.

సుజాత కళ్లు తెరిచింది. ఎదురుగా దీపంలా సారధి. మళ్లీ కళ్లుమూసుకొంది. ఆమె మనసు అతి ప్రశాంతగా వుంది.

* * *

'భయమేస్తోందా...' ఆపరేషన్ థియేటర్లో క్లోరోఫారమ్ ఎక్కిస్తూ అడిగాడు సారధి.


లేదన్నట్లు తలవూపింది సుజాత. యేమేమో చెప్పాలనివుంది. తన నొక్కసారి దగ్గరకు తీసుకోమని, 'సుజా' అని పిలవమని యింకా యెన్నో... కాని యేమీ చెప్పలేనట్లు నిస్సహాయంగా అతనివైపే చూస్తూ మత్తులోకి జారిపోయింది.

ఆమె ప్రాణంతో పోరాడుతూ చివరికి గంటన్నర తర్వాత ఆపరేషన్ థియేటర్లో నుండి బయటికి వచ్చాడు డాక్టర్ సారధి.

ఆపరేషన్ సక్సెస్ అయింది.

కాని ఆ విషయం అడగడానికి ఆమె తరఫువాళ్లెవరూ...లేరు...ఆత్రంగా అతని నోటినుండి ఆమాట వినాలనుకొనేవాళ్లెవ్వరూ లేరు...

'పాపం...సుజాత...' బాధగా నిట్టూరుస్తూ ముఖంపైన పట్టిన చిరుచెమటను తుడుచుకొన్నాడు సారధి.




సుజాత ఎక్కడెక్కడికో వెళ్లిపోతోంది ... కొండలు, నదులు సముద్రాలు...అన్నీ దాటుకొని ఎక్కడెక్కడికో వెళ్లిపోతోంది...అలా వెళ్లిపోతున్న ఆమెకు దూరంగా సారధి కనిపించాడు. 'డాక్టర్' —అరవబోయింది, నోటినెవరో గట్టిగా మూసినట్లు గొంతు పెగల్లేదు. క్రిందికి దూకేద్దామనుకొంది. కాని ఎవరో పట్టుకొన్నట్లు దూకలేకపోయింది.

'డాక్టర్...డాక్టర్...' రెండుచేతులూ చాపి అతనిని చేరుకోవాలని అల్లాడుతోంది. కాని అతనికి అంత కంతకు దూరమైపోతోంది ...

'డాక్టర్...' వులిక్కిపడి కళ్లు తెరిచింది సుజాత.

చాలమంది డాక్టర్లు అందుకోసమే యెదురు చూస్తున్నట్లు ఆమె ముఖం మీదికి వంగి పరీక్షగా ఆమెను పరిశీలిస్తున్నారు.

ఆమెకళ్లు సారధికోసం వెతికాయి.

దూరంగా సిరెంజ్‌లోకి మందెక్కిస్తున్న సారధిని చూసి అవి తళుక్కుమని మెరిశాయి.

అతడు యింజక్షన్ యిస్తుంటే ఆమె పెదవులు చిరునవ్వు నవ్వాయి.

ఆ గదిలో సారధితోపాటు అంతమంది వుండటం ఆమెకు నచ్చలేదు.

ఒక్కసారి అతడు తనను దగ్గరగా తీసుకోవా లనిపించింది.

కాని ఆమెకోరిక అతనికి తెలియదు. మరో రోగిని చూడటానికి వెళ్లిపోయాడు.

ఆమె కళ్లు నిరాశగా క్రిందికి వాలిపోయాయి.

* * *

రెండురోజులు గడిచిపోయాయి. 'సుజాతకు యింకేం ప్రమాదంలేదు...' సారధి తృప్తిగా నిట్టూర్చాడు.

ముఖ్యంగా తన అప్యాయత, ఆదరణల వలననే ఆమె కోలుకోగలిగింది. గుండె జబ్బు వున్న మనుషులకు హృదయంలో

ప్రశాంతత వుండటం యెంత అవసరమో తనకు తెలుసు.

అటువంటి శాంతికి దూరమై, అప్యాయత, ఆదరణల కోసం అలమటించిపోయిన సుజాతకు తన నుండి అవి లభించడం...ఆపరేషన్ సక్సెస్ కావడం...' నిజంగా అతనికి చాల తృప్తిగా వుంది.

'రజనికి విషయం చెప్పాలి ... చాల సంతోషపడుతుంది.

'ఆలోచిస్తూ సుజాత దగ్గర కెళ్లాడు.

అతని నోటి నుండి వినబోయే మాటల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తోంది సుజాత.

'ఇంక నీకేం ఫరవాలేదు...' స్నేహ పూర్వకంగా నవ్వాడు.

కాని ఆమె ఆశించింది అదికాదు ... ఆమె కళ్ళు నిరాశగా చూశాయి. అలా చూస్తుండగానే అతడు అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

మరో వెల రోజులు సాఫీగా గడిచిపోయాయి. ఇంక రెండు రోజులలో సుజాతను డిశ్చార్జి చేస్తారు ... ఆ విషయాన్ని గురించే ఆలోచిస్తూ కిటికీలో నుండి బయటికి చూస్తున్నది...

'సుజాతా...'

ఆత్రంగా... ఆశగా అటు వైపుకు తిరిగింది.

'నాకు కొడుకు పుట్టాడు...' సారథి ముఖంలో అంతులేని సంతోషం తొంగి చూస్తోంది.

సుజాత తల తిరుగుతోంది. ఆమె కూర్చున్న మంచం, ప్రక్కనున్న షెల్ఫు, అందులో వున్న పాలు, పళ్ళు, ఎదురుగా వున్న సారథి అందరూ కళ్ళముందు ఆగకుండా గిర్రున తిరుగుతున్నారు. పెద్ద ప్రళయం వచ్చేసి భూమిని ముంచేస్తోంది...

'సుజాతా ... యేమైంది...' క్రింద పడిపోతున్న ఆమెను బలంగా పట్టుకొన్నాడు సారథి.

ఆమె కళ్ళు అతడిని చూస్తూ వున్నాయి.

'మై గాడ్... సుజాతా...' నిర్జీవంగా తన చేతుల్లో వాలిపోయిన సుజాతను నిశ్చేష్టుడై చూశాడు డాక్టర్ సారథి.

అంతవరకు ఆరోగ్యంగా, ఉల్లాసంగా వున్న ఆమె అంత హఠాత్తుగా పోవడానికి కారణం అతనికి యెంత ఆలోచించినా అర్థం కాలేదు.

అతనికే కాదు...అక్కడున్న వాళ్ళెవరికీ కూడా అర్థం కాలేదు. అర్థం కాదు...


ఆంధ్రపత్రిక

"సాధారణ" నామ

ఉగాది సంచిక

ఆంధ్రపత్రిక "సాధారణ"నామ ఉగాది సంచిక ఉగాది పండుగకు ఎప్పటివలె అనేక ఆకర్షణలతో, త్రివర్ణ చిత్రాలతో "సాధారణ" పంచాంగంతో కూడ సర్వాంగ సుందరంగా వెలువడనున్నది. మీ ప్రతిని మా న్యూస్ ఏజంటువద్ద వెంటనే రిజర్వు చేసుకొనండి.

వెల: రూ 3/-లు.

మేనేజరు,

ఆంధ్రపత్రిక, మద్రాసు-1.

